క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని చింతనలంక గ్రామానికి చెందిన పోతుల వీరవెంకట సత్యనారాయణ శుక్రవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు ఈ సొమ్మును అందించారు. దాతకు ఆశీర్వచనాలు పలికి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చమురు కార్యకలాపాలతో అనర్థాలు!

అసెంబ్లీలో ప్రస్తావించిన రాజోలు ఎమ్మెల్యే

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: ఓఎన్జీసీ, గెయిల్ వంటి సంస్థల చమురు కార్యకలాపాలతో గ్రామాల్లో అనర్థాలు తలెత్తుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయా సంస్థలు ఏమాత్రం సహకరించడం లేదని రాజోలు ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ నెల 10వ తేదీన ×సాక్షి×లో ×యువతకు షాక్.. అభివృద్ధికి బ్రేక్× శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి, అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై మాట్లాడారు. ఆయిల్ సంస్థల కార్యకలాపాల వల్ల రోడ్లు, వంతెనలు పాడైపోయాయని, భూమి కుంగి డ్రెయిన్లు అస్తవ్యస్తమయ్యాయని, ముంపు వల్ల తాగునీటి కొరత, అనారోగ్యాల బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం దీనిపై తగిన సూచనలు ఇచ్చి, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజారోగ్యం దెబ్బతిని రాజోలు దీవితో పాటు కోనసీమ మరొక ఉద్దానం అయ్యే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సత్యరిత్విక్‌కు బంగారు పతకం



సత్యరిత్విక్

మామిడికుదురు: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన సూరో భారతి సంగీత్ కళా కేంద్ర 2024–25 సంవత్సరానికి నిర్వహించిన సంగీత పరీక్షల్లో కీ బోర్డు గ్రేడ్–2 పరీక్షల్లో లూటుకుర్రు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుల సత్యరిత్విక్ బంగారు పతకం గెలుచుకున్నాడు. ఇటీవల ఈ పరీక్షలు జరిగాయి. విద్యా పీఠం ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌శర్మ శుక్రవారం రిత్విక్‌కు బంగారు పతకం అందజేశారు. రిత్విక్ ప్రస్తుతం అమలాపురంలో పదో తరగతి చదువుతున్నాడు. ఇందుపల్లి విద్యా పీఠంలో అతను కీ బోర్డు ప్లే చేయడంలో శిక్షణ పొందాడు.

బాధితుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాధితుడికి చెక్కు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన 43 ఏళ్ల నేకూరి హరిచంద్ర ప్రసాద్ శరీరంపై పుండ్లు పట్టడంతో రెండు చోట్ల ఆపరేషన్ చేయించుకున్నారు. మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో వైద్యులను సంప్రదించగా, ఓ ఆపరేషన్ చేయాలని సూచించారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే ప్రసాద్ కష్టపడితే కానీ ఇల్లు గడవని పరిస్థితి. వైద్యానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో.. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. కొత్తకాలనీలో బాధితుడి ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు రూ.12 వేల చెక్కును అందజేశారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయవద్దు

మలికిపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రతి కూలీ ఉద్యమించాలని లిబ్‌టెక్ సంస్థ ప్రతినిధి ఎంఎం రాహుల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పూలే–అంబేడ్కర్ భవన్‌లో ఉపాధి హామీపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ఉపాధి కూలీ సంఘం నాయకుడు ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త రాహుల్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 30 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉన్నారని, ఆధార్ బేస్ పేమెంట్ సిస్టం తప్పనిసరి చేయడం వల్ల 10 కోట్ల మంది కూలీలు తొలగించబడ్డారన్నారు. ఉపాధి హామీ చట్టం పరిశోధకులు బీడీఎస్ కిషోర్ మాట్లాడుతూ, ఉపాధి బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారన్నారు. ఉపాధి డిమాండ్‌కు తగ్గట్టుగా రూ.మూడు లక్షల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పరంధామయ్య వివరించారు.

మళ్లీ వరదడడ

- పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- లంక గ్రామాల ప్రజలకు అవస్థలు
- అధికార యంత్రాంగం అప్రమత్తం

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి మళ్లీ వరద పెరుగుతోంది. దీంతో వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు వరద నీటి మట్టం 44.7 అడుగులకు పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 5,37,558 క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఐదోసారి వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ తగ్గినట్టే తగ్గి మళ్లీ వరద పెరుగుతూండటంతో లంక గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



అప్పనపల్లి స్నానాల రేవులో పరవళ్లు తొక్కుతున్న గోదావరి

పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి సుమారు 75 రోజుల క్రితం వరద ఉధృతికి కొట్టుకుపోయిన విషయం విదితమే. అప్పటి నుంచి ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద పెరిగిన ప్రవాహం

తీర గ్రామాల్లో కలవరం

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు వరద తీర గ్రామాల ప్రజల్ని ఆందోళనకు గురి చేసింది. గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల అటు భద్రాచలం, ఇటు ధవళేశ్వరం నుంచి వరద పోటెత్తుతోంది. ఆదివారం నాటికి ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మండల, రెవెన్యూ, జిల్లా అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశారు. దీంతో మండల పరిధిలోని పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాలతో పాటు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక తీరంలోని మత్స్యకార ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద మరింత పెరిగితే లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. మరోవైపు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు, ఇంకోవైపు వరద పెరుగుతుందన్న సమాచారం లంక గ్రామాల ప్రజల్ని కలవర పాటుకు గురి చేస్తోంది.

నేడు పాపారాయుడు పర్యటన

మలికిపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన కర్రి పాపారాయుడు తొలిసారిగా శనివారం రాజోలు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. మాజీ మంత్రి, పార్టీ రాజోలు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు నేతృత్వంలో పాపారాయుడు తొలుత అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు చేసి, అనంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్ శుక్రవారం తెలిపారు.

రక్తదానం

రావులపాలెం: ఓ గర్భిణికి ఆపరేషన్ కోసం స్థానిక వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు శుక్రవారం రక్తదానం చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. ఆమెకు బి నెగిటివ్ బ్లడ్ అవసరమైతే తమ సభ్యులైన ఎం.దుర్గ, సీహెచ్ అనిల్, కె.మాధవరావు రక్తదానం చేశారన్నారు. ఇప్పటివరకు తమ యోగా సంస్థ నుంచి 30 వేల మందికి పైగా రక్తదానం చేసినట్టు వివరించారు.

వనరుల సమీకరణతో గ్రామాభివృద్ధి

– ఎంపీపీ మార్గన గంగాధరరావు



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు



మామిడికుదురులో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ వెంకన్న

కొత్తపేట: పంచాయతీలకు సొంత వనరులను సమీకరించుకోవడం ద్వారా సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్థానిక సంస్థల సొంత ఆదాయ వనరులపై మండల స్థాయిలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై, శిక్షణను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, పంచాయతీలు సొంతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటే నిధులు అవసరమన్నారు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులు, స్థానికంగా స్టాంప్ డ్యూటీ వంటి వాటితో పాటు, పంచాయతీ స్థలాలు గుర్తించి, వాటిలో కమర్షియల్ షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ఇలా ఆదాయ వనరులను సమకూర్చుకుని, సొంతంగా రోడ్లు, డ్రైన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, ఆస్తులను పరిరక్షించుకోవాలని ఎంపీడీఓ నరేష్‌కుమార్ నిర్దేశించారు. ప్రతి సర్పంచ్ తన హయాంలో ఒక్క ఆక్రమణకు అవకాశం లేకుండా స్థలాలను కాపాడుతానని ప్రతిజ్ఞ చేసి, పరిరక్షించాలని కోరారు. అనంతరం రీసోర్స్‌పర్సన్లు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం ఎంపీడీఓ రామన్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు పల్లి భీమారావు, బూసి జయలక్ష్మి, కుడుపూడి రామలక్ష్మి, గ్రామ కార్యదర్శులు మంగిపూడి రాంబాబు, డి.వెంకటేశ్వరరావు, ఎస్ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ ఆదాయ వనరులను పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బి.మమత, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పన్నులు, నాన్ టాక్స్‌లు వల్ల వచ్చే ఆదాయాన్ని పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడికుదురు: పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీవో అడబాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదాయ మార్గాలను పెంచుకోవడంపై ఆలోచన చేయాలన్నారు. ట్రైనర్ వి.వెంకన్న పలు అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకటేశ్వరరావు, పి.గన్నవరం నియోజకవర్గం, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, జాలెం రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: పంచాయతీలు సొంత వనరులను సమకూర్చుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరిపాలనాధికారి ఎం.మెహెర్ ప్రకాష్, జేఈలు షేక్ వలీ, సతీష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజ ప్రగతి

అంబాజీపేట: సమాజంలో మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుకపూడిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ, మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా, వైద్యులను సంప్రదిస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అనంతరం మహిళలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సీహెచ్‌వో బి.అప్పారావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, ఆహార వ్యవహార శైలి, పని ఒత్తిళ్ల వల్ల మహిళలకు వస్తున్న వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎం.శివశంకర్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం జరిగింది. వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎన్వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన పౌష్టికాహార వంటకాలను గర్భిణులకు పంపిణీ చేశారు. అలాగే పెదపల్లి, చొప్పెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సాయికిశోర్, ఎస్.లక్ష్మీస్నేహలత ఆధ్వర్యంలో చింతలూరు, చెముడులంక గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

అయినవిల్లి: ఆరోగ్య విషయాల్లో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ అన్నారు. వీరవల్లిపాలెంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షత వహించారు. ఆరోగ్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ్ కోరారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ

అంబాజీపేట: గ్రామంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం, పంచదార, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్‌లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రేషన్ షాపులకు సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బి.చినబాబు, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు పీవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, వి.రామకృష్ణ, ఐవీవీ రమేష్ ఆర్డీవో వెంట ఉన్నారు.

అన్న ప్రసాద పథకానికి విరాళాలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ – గోపాలస్వామివారి ఆలయంలో అన్న ప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం గ్రామానికి చెందిన నాళం వెంకటసుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.10,116, పాలకొల్లుకు చెందిన గాదె కృష్ణారావు కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనాలు పలికి, స్వామివారి శేష వస్త్రం, చిత్రపటాలను అందజేశారు.

బాలకృష్ణ తీరు ఆక్షేపణీయం

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: చట్టసభలో మాజీ సీఎంతో పాటు, ఓ ప్రఖ్యాత నటుడిపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇష్టానుసారం, అగౌరవంగా మాట్లాడిన తీరు ఆక్షేపణీయమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీని చట్టసభ అనుకుంటున్నారా.. లేక పిచ్చాస్పత్రి అనుకుంటున్నారా అని ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో మాట్లాడిన తీరు యావత్ ప్రపంచం చూస్తోందన్న సంగతి బాలకృష్ణకు తెలియకపోవడం విచారకరమన్నారు. విలువైన సభా సమయాన్ని ఇలాంటి వారికి కేటాయిస్తూ ఆయనకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మద్దతు పలకడం దారుణమన్నారు. అదే సభలో ఉన్న మంత్రులు, సీఎం చంద్రబాబు కూడా బాలకృష్ణను వెనకేసుకుని వచ్చారని సూర్యారావు ఆరోపించారు. ఇలాంటి వాళ్లను అసెంబ్లీకి రాకుండా చేయాలని మండిపడ్డారు. కూటమి వికృత చేష్టలకు అసెంబ్లీ వేదిక కావడం సిగ్గు చేటన్నారు. ప్రజా ధనాన్ని ఇలా వృథా చేయడం ఈ కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య కుమార్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తాడి సహదేవ్, పార్టీ జిల్లా కార్యదర్శి కూనపరెడ్డి రాంబాబు, నాయకులు మంగెన సింహాద్రి, దొంగ నాగ సత్యనారాయణ, కుసుమ చంద్రశేఖర్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



డాక్టర్ సుమలత

ఆలమూరు: ప్రపంచాన్ని పట్టి పీడిస్తూ అనేక మంది మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా మహిళలందరూ అవగాహన పెంచుకోవాలని స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుమలత అన్నారు. మండలంలోని చెముడులంకలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో ఆమె పాల్గొన్నారు. ఆహార శైలిలో మార్పుల ద్వారా క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చన్నారు. రాష్ట్రంలో ఏటా 70 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, 40 వేల మంది వరకూ మృతి చెందుతున్నారన్నారు. జిల్లాలో సుమారు మూడు వేల మంది క్యాన్సర్ బాధితులున్నట్లు తెలుస్తోందన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణకు పీఓయూ 222 గ్రీన్ చానల్ ఓపీ విభాగం మంగళ, గురువారాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చొప్పెల్ల సీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీ స్నేహలత, బి.అనంత రామకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి పాల్గొన్నారు.


లోకపావని.. జగజ్జననీ..



తాటికాయలవారిపాలెంలో శ్రీమహాలక్ష్మీ దేవి అవతారంలో..



తూర్పుపాలెంలో పూజలందుకుంటున్న కనకదుర్గ అమ్మవారు



దుర్గాదేవి అలంకారంలో పాశర్లపూడి దుర్గమ్మ



లక్ష్మీదేవి అలంకరణలో సిరిపల్లి కొండాలమ్మ



మహాలక్ష్మీదేవిగా కొత్తపేట బి.సావరం విజయ కనకదుర్గాదేవి

- మహాలక్ష్మి అవతారంలో విజయ కనకదుర్గాదేవి దర్శనం
- వాడవాడలా అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం కనకదుర్గాదేవి ఆలయాలు, పందిళ్లలో దుర్గాదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామగ్రామాన, వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో అత్యధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలు మహిళలతో కిక్కిరిశాయి. స్థానిక బొరుసువారి సావరం విజయ కనకదుర్గాదేవి అమ్మవారిని ఆలయ అర్చకులు మహాలక్ష్మీదేవిగా, గాజులు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బోడిపాలెం విజయ కనకదుర్గాదేవిని, గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారిని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, వాడపాలెం గ్రామంలో జ్ఞానసరస్వతీదేవి అమ్మవారికి, మారుతీసెంటర్, ఏనుగుల మహల్, ఇతర గ్రామాల్లో అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

రూ. వంద నోట్లతో అలంకరణ

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక కనకదుర్గమ్మ వారిని రూ.వంద కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి.

శక్తి స్వరూపిణిగా..

మామిడికుదురు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారు శక్తి స్వరూపిణిగా భక్తుల పూజలందుకుంటున్నారు. ఉత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. ఈదరాడ కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. 116 మంది మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెదపట్నంలంక కనక దుర్గమ్మ భక్తులకు స్కంధమాతగా దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవలో కొలువు తీరిన అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన వైభవంగా జరిపించారు. అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి సన్నిధిలో మహాలక్ష్మి అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. ఇక్కడ జరిగిన ప్రత్యేక పూజల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మగటపల్లి గాయత్రీ తిశక్తి పీఠంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరి దేవిగా అలంకరించారు.

లక్ష్మీదేవి అలంకరణలో కొండాలమ్మ

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లిలో కొలువైన కొండాలమ్మ అమ్మవారు శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అల్లవరపు చక్రవర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించారు. లలితా సహస్ర పారాయణ చేశారు. విలసలో కనకదుర్గమ్మ, ముక్తేశ్వరంలోని ముక్తికాంతమ్మ, తొత్తరమూడి రాజరాజేశ్వరీదేవి, నేదునూరు సర్వమంగళ పార్వతీదేవి అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. సిరిపల్లి, కె.జగన్నాథపురం, మాగం, కొండుకుదురు, ఎస్.మూలపాలెం, పొట్టిలంక, అయినవిల్లిలంక, మడుపల్లి, వెలువలపల్లి, చింతనలంక గ్రామాల్లో శరన్నవరాత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

లలితాదేవి అలంకరణలో..

అంబాజీపేట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బస్ స్టేషన్ వద్ద ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ బ్రహ్మత్వంలో చంద్రమౌళి ధనుష్, కామేష్‌శర్మ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. స్థానిక శ్యామలానగర్‌లో ఉన్న వీణాశ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. మాచవరం శివారు కోతి వారి అగ్రహారంలో ఉన్న భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాచవరం శివాలయం వద్ద ఉన్న వారాహి అమ్మవారిని గాజులతో అలంకరించారు.

శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో..

పి.గన్నవరం: దేవీ నవరాత్ర మహోత్సవాల సందర్భంగా తాటికాయలవారిపాలెంలోని శ్రీకనకదుర్గమ్మ వారు శుక్రవారం శ్రీమహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. పి.గన్నవరంలోని లక్ష్మీకనకదుర్గమ్మకిపూజలు చేశారు.

ఆలమూరు: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెముడులంకలో భవానీ భక్తుల నేతృత్వంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రూ.4.2 లక్షల కరెన్సీతో అలంకరణ



కరెన్సీ అలంకరణలో తాటికాయలవారి పాలెంలోని మసేనమ్మ అమ్మవారు

పి.గన్నవరం: జి.పెదపూడి గ్రామ శివారు ఏటిగట్టు వద్ద వేంచేసిన మసేనమ్మ అమ్మవారికి శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రూ.4.2 లక్షల విలువైన కరెన్సీతో అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కొత్తపేట బోడిపాలెంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఈదరాడలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అంబాజీపేటలో వాసవీ కన్యకాపరమేశ్వరికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



చెముడులంకలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు